క్లుప్తంగా

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ఈ విద్యా సంవత్సర ప్రారంభంలోనే రూ.8.5 లక్షల రూపాయల ప్యాకేజీతో కూడిన ప్రాంగణాల నియామకాలకు శ్రీకారం గొప్ప శుభ పరిణామానికి సంకేతమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో గురువారం ఈపామ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి రూ.8.5 లక్షల రూపాయల వార్షిక వేతనంతో ఉద్యోగాలను సాధించారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థుల అద్భుతమైన సాంకేతిక ప్రతిభకు అందివస్తున్న ఈ అవకాశాలు, ఉత్తమ అధ్యాపక బృందం అందిస్తున్న మెరుగైన విద్య, కళాశాల అందించిన శిక్షణా కార్యక్రమాల ఫలితానికి నిదర్శనమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈపామ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకంలో సీఎస్ఈ విభాగం నుంచి గింజుపల్లి వంశి, మొహమ్మద్ ఖాశీయా తెహసీన్, మువ్వా హిమశ్రీ, ముగ్గురు విద్యార్థులు, సీఎస్ఎమ్ విభాగం నుంచి కె.చేతన్ ఈశ్వర్, కె.త్రినాథ్, ఇద్దరు విద్యార్థులు, డేటా సైన్స్ విభాగం నుండి ఎం.డి. రఫీక్, ఎస్.ధర్మతేజ, పి.రిషిత ముగ్గురు విద్యార్థులు, మొత్తం 8 మంది విద్యార్థులకు నాల్గవ సంవత్సరం, 2వ సెమిస్టర్ డిసెంబర్ నెల నుంచి రూ 27.5 వేల రూపాయల స్టైపెండ్‌తో 6 నెలల పాటు ఇంటర్న్ షిప్ అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రూ 8.5 లక్షల రూపాయల అధిక ప్యాకేజీతో ఉద్యోగాల్లోకి చేరుతారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ కె సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

సమస్యాత్మక కలుపు మొక్క వయ్యారిభామ

గుంటూరు రూరల్: వయ్యారిభామ సమస్యాత్మక కలుపుమొక్క అని ఈ మొక్కను విత్తనాలు రాకముందే నివారించాలి, లేదా పీకివేయాలని లాంఫాం శాస్త్రవేత్తలు తెలిపారు. 20వ పార్థీనియం నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం నగర శివారుల్లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన వారోత్సవాలు శుక్రవారంతో ముగుస్తాయని తెలిపారు. పార్థీనియం (వయ్యారిభామ) మొక్క వల్ల పంటలకు నష్టం కలగటంతోపాటు, మనిషి జీవన విధానానికి, అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుందని తెలిపారు. రైతులు తమ పంటపొలాల్లోని వయ్యారిభామ మొక్కలను గమనించినట్టయితే వెంటనే వాటిని పీకి తగలబెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ పరిశోధన స్థానంలోని క్షేత్రంలో వయ్యారిభామ మొక్కలను పీకి తగలబెట్టారు. కార్యక్రమంలో లాంఫాం ఇంచార్జ్ ఏడీఆర్, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) డాక్టర్ డి.మోహన్ రెడ్డి, సేద్యవిభాగం విశ్వవిద్యాలయం హెడ్ డాక్టర్ పి.మునిరత్నం, సమగ్ర కలుపు యాజమాన్యం విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ, డాక్టర్ పి.అమరజ్యోతి పాల్గొన్నారు.

శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం శ్రీమద్భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, ఆలయ పాలకవర్గం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మ చారి సువీరానందస్వామి ప్రసంగిస్తూ వేదశాస్త్ర పఠనం, పరమేశ్వరుని నామ జప సాధన వంటివి వాక్కుకు సంబంధించిన తపస్సులు అని అన్నారు. తపస్సులను ఫలకాంక్షలేని యోగు లు శ్రద్ధతో ఆచరించినప్పుడు, వాటిని సాత్విక తపస్సులుగా పిలుస్తారని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడికి తెలియజేశారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం..

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ గురువారం చండీహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుళ్లిపోతున్నా కనికరించరే!!

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పది రోజులుగా వరదనీటిలోనే వరి పైర్లు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- పంట నష్టపరిహారం ఇవ్వాలంటూ రైతుల వేడుకోలు

వరదనీటిలోనే వరి పైర్లు



పొలాల్లో నీరు తగ్గడంతో కుళ్లిపోయి కనిపిస్తున్న వరినారు



రెండేళ్లుగా ఇసుక బస్తాలతో గుంటూరు చానల్ గండి పూడ్చిన దృశ్యం

పెదకాకాని: వరద వచ్చి పదిరోజులు గడుస్తున్నా పొలాలను వర్షపునీరు వీడటం లేదు. పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే నీరు తగ్గినప్పటికీ వరిపైరు కుళ్లిపోయి కనిపిస్తోంది. పొలాల నుంచి వర్షపునీరు బయటకు పోకుండా చెరువుల్లా కనిపిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులు పంట సాగు చేసేందుకు వరి పైరు చేతికి దక్కుతుందా, కుళ్లిపోతుందా అనే సందిగ్ధంలో పడ్డారు. ఈ ఏడాది రైతుల పరిస్థితి అయితే అతివృష్టి లేదంటే అనావృష్టి అన్న చందంగా మారింది. వరి విత్తనం పెట్టే గడువు దాటిపోతున్నా వర్షం పడకపోవడంతో ఎండు దుక్కుల్లోనే విత్తనం పెట్టారు. పది రోజుల తరువాత వారం రోజుల పాటు కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో పెట్టిన విత్తనం మొలక దశలోనే గింజ మురిగిపోయింది. ఆ తరువాత పొలాలు ఆరగానే రెండవసారి విత్తనం ఎదపెట్టాల్సి వచ్చింది. పొలం అంతా బాగా మొలక శాతం రావడంతో పైరు చక్కగా మొలకెత్తింది. మొక్క పెరుగుతున్న కొద్దిరోజులకే కురిసిన వర్షానికి వరద వచ్చి వర్షపునీరు పంట పొలాలను చుట్టుముట్టింది. ఈనెల 12వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో పాటు కాలువ కట్టకు గండ్లు పడ్డాయి.

పంట కాలువల పటిష్టత మరిచారు

వ్యవసాయ ఆధారిత మండలమైన పెదకాకాని ఏరియాలోని నంబూరు, గోళ్ళమూడి, ఉప్పలపాడు, వెంకటప్పాపురం, దేవరాయబొట్లవారిపాలెం, తంగెళ్ళమూడి గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వరి సాగు ప్రధానంగా జిల్లాలోని గుంటూరు చానల్ (కొత్తకాలువ) ద్వారా సాగు నీరు, తాగునీరు, హైలెవల్ ఛానల్ (పాతకాలువ) ద్వారా ప్రవహిస్తున్న సాగు నీటి ఆధారంగా పంటలు పండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట కాలువలను పటిష్టం చేయడం మరచింది. అధిక వర్షాలు, వరద కారణంగా వరిపొలాలు నీట మునగడంతో పాటు పొలాల్లో నిల్వ చేసిన ఎరువుల బస్తాలు కూడా అడుగుభాగంలో కరిగిపోయాయి. వరి పొలాలను పరిశీలించిన అధికారులు వరద ప్రభావంతో 11 వేల ఎకరాలు వరి నీట మునిగినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడిప్పుడే బయట పడుతున్న వరి పొలాల్లో మొక్కలు కుళ్లి, రంగుమారి కనిపిస్తున్నాయి. పది రోజులైనా చెరువుల్లానే వరి పొలాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు స్పందించి అన్నదాతలకు పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పదిరోజులుగా పొలంలో నీళ్లు!



వరద నీటితో పొలాలు మునిగి పదిరోజులు అవుతోంది. ఇంకా పొలాలకు చేరిన నీరు బయటకు పోలేదు. దీంతో వరిసాగు ఆందోళన కరంగా మారింది. నీళ్ల తగ్గిన పొలాల్లో బయట పడిన పైరు కుళ్లిపోయి కనిపిస్తుంది. ఇప్పటికీ పొలాలు చెరువుల్లానే ఉన్నాయి. దీంతో పాటు పొలాల్లో పెట్టుకున్న ఎరువుల బస్తాలు కూడా కొన్ని కరిగిపోయాయి.

–తియ్యగూర గోపిరెడ్డి, రైతు, నంబూరు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వరద నీరు ముంచెత్తిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ ఏడాది రైతుల పరిస్థితి అయితే అతివృష్టి లేదంటే అనావృష్టి అన్నచందంగా మారింది. ఇప్పటికే ఎకరానికి 12 వేల నుంచి 15 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కొందరు కౌలు ధాన్యం ఇచ్చే ఒప్పందం కుదుర్చుకోగా మరికొందరు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించి సాగు చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

–గుజ్జుల పాములరెడ్డి, నంబూరు, రైతు

పంట నష్టపరిహారం కోరితే కేసులు పెడతారా?

- పెదకాకాని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి
- వరి పొలాలు నీట మునిగింది వాస్తవం



మాట్లాడుతున్న మల్లికార్జున రెడ్డి

పెదకాకాని: వరద ప్రభావంతో వరి పొలాలు మునిగి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అడిగితే ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేసులు పెట్టడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి హితవు పలికారు. పెదకాకాని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరడం తప్పు ఎలా అవుతుందన్నారు. టీడీపీ నాయకులు పంటలు మునగలేదని చెబుతున్నారనీ, స్వయంగా తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి 10 నుంచి 11 వేల ఎకరాలు వరి పైరు వరద నీటి ప్రభావం వల్ల నీట మునిగిందని ప్రకటించిన విషయాన్ని గుర్తించాలన్నారు. వరి పొలాలు నీటిలో మునిగాయని సాక్షాత్తు ప్రభుత్వం పంపించిన శాస్త్రవేత్తలు ప్రకటించారని, పొలాల్లో భద్రపరచిన ఎరువుల బస్తాలు కూడా నీటిలో కరిగిపోయిన విషయం తెలుసుకోలేకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే భయపడేది లేదన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడం

కూటమి నాయకులపై పెట్టే అక్రమ కేసులకు భయపడేదిలేదని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల హెచ్చరించారు. గుంటూరు ఛానల్ (కొత్తకాలువ) వద్ద పడిన గండిని కూటమి ప్రభుత్వం ఇసుక బస్తాలు పేర్చి అలానే వదిలేసిందని, 24 లక్షల నిధులు సొమ్ము చేసుకుని తూటికాడ, గుర్రపుడెక్క నామమాత్రంగా తొలగించిన కూటమి నాయకులకు కాలువ కట్టలు బలోపేతం చేయాలనే ఆలోచన రాకపోవడం దురదృష్టకరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి 13 వేల రూపాయలు ఇచ్చారని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు, మండల మహిళా అధ్యక్షురాలు షేక్ షహనాజ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకర కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు అర్థల బ్రహ్మం, ఆలపాటి రాఘవ, ఎస్‌డీ పఠాన్, షేక్ నజీర్ అహ్మద్, మున్నంగి రాంబాబు, లంకపల్లి శ్రీనివాస్, మురికిపూడి చంద్రశేఖర్, పెనుమాల అరుణ్, కూచిపూడి మధు, దంతాల శ్రీనివాసరావు, ఆలా శ్రీనివాసరావు, రెడ్డి నాగేశ్వరరావు, పెండెం విజయ్‌బాబు, యడ్లపల్లి రమేష్, సుంకర నర్సిరెడ్డి, బండ్లమూడి బానుకిరణ్, వేల్పుల నాగరాజు, చిలకా పున్నయ్య పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి



పొన్నూరులో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పొన్నూరు: ఒంగోలులో రేపటి నుంచి నిర్వహించనున్న 28వ సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుష్పాల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుష్పాల సత్యనారాయణ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే మహాసభలలో నియోజకవర్గంలోని సీపీఐ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సీపీఐ కార్యదర్శి షేక్ గౌస్, రావూరి సుగుణ, గోవిందరాజులు, శంకర్, సిద్దు, బుజ్జి, రత్నబాబు, సుబ్బమ్మ, కోటేశ్వరమ్మ, ప్రభుదాసు, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమై తహసీల్దారుకు వినతి



తహసీల్దారు శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేబ్రోలు: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చేబ్రోలు తహసీల్దారు కె.శ్రీనివాసశర్మకు సమస్యలతో కూడిన వినతి పత్రంను అందజేశారు. చేబ్రోలు సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నూరు ప్రాజెక్ట్ కార్యదర్శి రత్న మంజులా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఫేస్ యాప్‌లు, ఇతర యాప్‌ల వల్ల పనిభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల అమలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం సమస్యలపై స్పందించకపోతే దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి రాధ, శేషానంద కుమారి, దయమ్మ, తిరుపతమ్మ, సుప్రియ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో అవగాహన సదస్సు



క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ ట్రిబుల్ ఈ బ్లాక్‌లోగల ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి సెమినార్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ (ఏక్యూవిహెచ్ 2025) రెండు రోజుల ఆన్లైన్ బూట్ క్యాంప్ గురువారం ప్రారంభమైంది. అమరావతి క్వాంటం వ్యాలీ హెక్థాన్‌కు ఇంజనీరింగ్ కళాశాల నుండి పది టీములు 60 మంది విద్యార్థినీ విద్యార్థులు, ఎంసీఏ విభాగము నుండి ఒక టీం ఆరుగురు విద్యార్థిని విద్యార్థులు ఈ ఆన్లైన్ బూట్ క్యాంపులో పాల్గొన్నారు. ఎస్‌పీటీసీ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈరోజు బూట్ క్యాంప్‌లో రాష్ట్ర సిఈఓ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టర్ సి.చంద్రమౌళి మాట్లాడుతూ ఐడియేషన్, ప్రాబ్లమ్స్ స్టేట్‌మెంట్, హ్యాకథాన్ గురించి వివరించారు. గోవా క్యాంపస్‌కు చెందిన బిట్స్‌పిలాని ప్రొఫెసర్ ఇంద్రాక్షిరాయి చౌదరి మాట్లాడుతూ క్వాంటం మెకానిక్స్, క్వాంటం అలగార్థం గురించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం .గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన ఏర్పరచుకోండి

- కేంద్ర ప్రభుత్వ రెగ్యులేటరీ సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ నర్రా శ్రీనివాసరావు
- న్యాయ విద్యార్థులకు కెరీర్ ఇన్ లా అంశంపై అవగాహన సదస్సు



విద్యార్థులతో న్యాయవాది నర్రా శ్రీనివాస్

పెదకాకాని(ఏఎన్‌యూ): న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే వారందరూ సమాజంలోని అన్ని విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ న్యాయ సలహాదారు కేంద్ర ప్రభుత్వ రెగ్యులేటరీ సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ నర్రా శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విద్యార్థులకు కెరీర్ ఇన్ లా అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు రోజుకు 14 నుంచి 18 గంటల పాటు కష్టపడితే ఆ తరువాత భవిష్యత్ మొత్తం వారు ఉన్న తశ్రేణిలో రాణించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వృత్తి ప్రావీణ్యం సంపాదించడానికి దేశవ్యాప్తంగా జరిగి అన్ని జాతీయస్థాయి యూనివర్సిటీ స్థాయి మూట్ కొర్టు పోటీలలో పాల్గొనడం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే నిరంతర పాఠ్య పఠనంతో పాటు ఉన్నత న్యాయస్థానాలు వెలువరించిన ల్యాండ్ మార్క్ కేసులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. వీటన్నిటి కంటే ముందుగా ప్రతి న్యాయ విద్యార్థి గొప్ప గొప్ప న్యాయవాదుల, న్యాయమూర్తుల జీవిత విజయ గాథలను తెలుసుకోవడానికి వారి ఆత్మ కథల పుస్తకాలు చదవాలన్నారు. ఈ సభకు అధ్యక్షులుగా వ్యవహరించిన న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ వర్సిటీలో న్యాయ విద్యార్థుల న్యాయమూర్తి నైపుణ్యం, విద్యా నాణ్యతల కోసం అధికారగణం ఎప్పటికప్పుడు ఎన్నో నాణ్యమైన సదుపాయాలను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. తరానికి తరానికి మధ్య అంతరాయం లేకుండా ఆ విజయ పరంపరను కొనసాగించడానికి వర్సిటీ పూర్వ విద్యార్థుల విభాగంలోని ప్రముఖులను ఇలా అతిథులుగా ఆహ్వానించి వారి అనుభవాలతో అనేక అకడమిక్ మెలకువలను నేర్పించడానికి తాము కృషి చేస్తున్నామన్నారు. చివరిగా నర్రా శ్రీనివాసరావుకు న్యాయవిభాగం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.వెంకట రమణ, ఎస్.చంద్రశేఖర్, ఘంటా సతీష్ కుమార్, చెన్నం సతీష్ కుమార్, శివరాం, అభిలాష్ గోపీనాథన్, జ్యోతి సంపూర్ణ, పరుచూరు కుమారి, చెన్నారావు, అట్లూరి జాషువా డానియల్, గొడవర్తి కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లు

పొన్నూరు: ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో సంక్షేమ పథకాలు ఆపడం సరికాదని అన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని కోరారు. ఎఫ్ ఆర్ ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్‌లో ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మీ, విజయకుమారి, ఎస్తేరు, కళ్యాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. మండల అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయు జిల్లా కార్యదర్శి వై నేతాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్ వాడీ కార్యకర్తలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, చాలీచాలని జీతాలు తీసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్నారన్నారు.

అలాంటి అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించవని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి శాపంగా మారాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ నుండి నిధులను విడుదల చేయాలని, అంగన్‌వాడీలకు తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్, ఇతర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. చిన్నపిల్లలకు ఆలన పాలన చూసి అంగన్‌వాడి వర్కర్స్ హెల్పర్స్ పిల్లలకు రేషన్ కార్డు లేదు అనే వంకతో తల్లికి వందనం వర్తించలేదని, అంగన్‌వాడీ వర్కర్‌లకు, హెల్పర్‌లకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసే జీవోను తక్షణమే జీవో ఇవ్వాలని.హెల్పర్లను వర్కర్లుగా ప్రమోట్ చేసి ఖాళీ స్థానాలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ సీఐటీయూ నాయకులు కె.పావని, జి.సీత, ఎస్.ఇందువాణి, డి.అమరజ్యోతి, టి. వరకుమారి, ఎండీ రుక్సానా బేగం, పి.కనకవల్లి, పిఅంజనాదేవి, కె.రాజ్యలక్ష్మి, బి.బాబురావు, కే. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో గంజాయి విక్రయదారులు అరెస్టు



పొన్నూరు: ఒరిస్సా నుంచి పొన్నూరు పట్టణానికి తీసుకువచ్చి గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు, వినియోగదారులైన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జనార్ధన రావు తెలిపారు. ఈ కేసులో 12 మందిని అరెస్టు చేసిన నేపథ్యంలో గురువారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఒరిస్సాకు చెందిన మనోజ్ గంజాయిని గుంటూరుకు తీసుకువచ్చి, పొన్నూరు పట్టణంలోని ఇటుకంపాడు రోడ్డుకు చెందిన షేక్. ఫజల్‌కు విక్రయిస్తున్నారు. ఫజల్ తో పాటు అతని తల్లి ఆషా మరో నలుగురు యువకుల ద్వారా గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా పట్టణ పరిధిలో విక్రయిస్తున్నారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1500 గ్రాముల గంజాయిని సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులు (విక్రయ దారులు) పట్టణానికి చెందిన షేక్ ఫజల్, షేక్ ఫయాజ్, నక్కల రవికుమార్, షేక్ మహబూబ్ అక్రమ్, పఠాన్ షారుక్ ఖాన్, నున్న యశ్వంత్, వినియోగదారులైన పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ బషీర్, కంచర్ల చంద్రకాంత్, రుద్రపాటి అభిషేక్, షేక్ అల్లా బక్షు, బి. ప్రశాంత్ లతోపాటు మండలంలోని దండమూడికి చెందిన కంభంపాటి శ్రీనాథ్ రెడ్డి, యాకసిరి సూర్యనారాయణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మనోజ్, ఆషా పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ వీరా నాయక్, ఎస్సై శ్రీహరి, ఏఎస్ఐ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

నగర పరిధిలో పచ్చదనం పెంచేలా కృషి



గాయత్రినగర్ పార్కులో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ ఇన్నర్ రింగ్ రోడ్, గాయత్రి నగర్, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటి, నగరాన్ని సుందర, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నగరంలో ప్రతి పార్క్‌లో, వాకింగ్ ట్రాక్‌లు, ఖాళీ స్థలాలు, ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి మొక్కలు నాటేందుకు, అనంతరం వాటిని పరిరక్షించడానికి స్థానికులు, వాకర్స్, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం అధికారులు, సిబ్బంది పార్క్ లను శుభ్రంగా ఉంచడానికి శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, బహుళ అంతస్తు భవన నిర్మాణదారులు తప్పనిసరిగా నిబంధనల మేరకే నిర్మాణాలు చేయాలని, భవన నిర్మాణ అనంతరం నిర్మాణ వ్యర్థాలను వారే తొలగించాలన్నారు. ప్రతి భవనం ర్యాంప్‌లను రోడ్ల మీదకు రాకుండా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఉమెన్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జూనియర్ విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ జె.పద్మ, ఆర్ఐఓ జి.సునీత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ, ఆధునిక వస్త్రధారణతో పాల్గొన్నారు.